
ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023
5
విజయనగరం



భూ పట్టాల పంపిణీకి ప్రతిపాదనలు పంపాలి

ప్రజాశక్తి-విజయనగరం

పేదలు సాగుచేసుకుంటున్న వ్యవసాయ భూములకు సంబంధించి, పట్టాల పంపిణీ కి తాహశీల్దార్లు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కోరారు. భూ పంపిణీకి వచ్చిన ప్రతిపాదనలపై తన ఛాంబర్‌లో మండలాల వారీగా ఆయన శుక్రవారం సమీక్షించారు. ప్రతీ తాహశీల్దార్ తమ మండలానికి ఇచ్చిన లక్ష్యం మేరకు, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. లోకాయుక్త కేసులకు సంబంధించి, వివిధ శాఖల వారీగా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో, కేసుల గురించి వివరింగా చర్చించారు. లోకాయుక్త కేసులకు సంబంధించి, సమగ్ర వివరాలతో వారం రోజుల్లో నివేదికలను పంపించాలని ఆదేశించారు. ఇలాంటి విషయాల్లో జాప్యం చేస్తే, తరువాత ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ వైద్యం అంతంత మాత్రమే

మందులు, వైద్య పరీక్షలూ అరకొరే
మార్చి 1 నుంచి పథకం అమలు
ఈలోపు సమస్యలు పరిష్కారమయ్యేనా?

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రస్తుతం ట్రయల్ రన్ నడుస్తోంది. మార్చి 1వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రస్తుతం కేవలం విలేజ్ క్లీనిక్‌లకు మాత్రమే పరిమితమౌతుంది. ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తామన్న ప్రభుత్వ హామీ అరకొరగానే మంచాలపై మూలుగుతున్న రోగులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. మందులు, వైద్య పరీక్షలు కూడా అంతంతమాత్రంగానే అందుబాటులో ఉన్నాయి.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంటింటికీ వైద్యసేవల పేరిట సుమారు ఆరు నెలల క్రితం విలేజ్ క్లినిక్‌ల ట్రయల్‌రన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పిహెచ్ సిలకు వాటి పరిధిలోనున్న వైఎస్ ఆర్ హెల్త్ క్లీనిక్ లను అనుసంధానం చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పిహెచ్ సిలోగల ఇద్దరు వైద్యులు చెరో కొన్ని క్లీనిక్‌లకు బాధ్యత వహించాల్సి వుంటుంది. వైద్యులు రోజుకొకరు చొప్పున తమకు కేటాయించిన క్లీనిక్‌లో ఒకపూట, ఆ క్లీనిక్ పరిధిలోగల ఇంటినుంచి బయటకు రాలేని రోగుల ఆరోగ్య తనిఖీలు రెండోపూట నిర్వహించాలి. పిహెచ్‌సికి కేటాయించిన 104వాహనంలోనే ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో కలిసి చేరుకుంటారు. ఈ వాహనంలోనే మందులు, సుగర్, బిపి, హెచ్ఐవి, థైరాయిడ్ వంటి 17రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. వీరికి క్లీనిక్‌లో నియమించిన బిఎస్సీ నర్సింగ్ సిబ్బంది, సంబంధిత సచివాలయ ఎఎన్ఎం, స్థానిక ఆశా వర్కర్ సాయపడతారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 1088 అధునాతన 104 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. సుమారు 46వేల మంది బిఎస్‌సి నర్సింగ్ స్టాఫ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లను నియమించినట్టు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజని ప్రకటించారు. కానీ, ఆచరణలో చాలా చోట్ల ఈ సేవలు కేవలం విలేజ్ క్లీనిక్ లకే పరిమితమయ్యాయి. పిహెచ్‌సిలు, సచివాలయ కేంద్రాలు ఉన్న గ్రామాల్లో ఫ్యామిలీ వైద్యం బాగానే అమలవుతున్నా మధుర గ్రామాల్లో సరిగా అందడం లేదు. బాడంగి మండలంలో మొత్తం 25పంచాయతీల పరిధిలో 32గ్రామాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఒకే ఒక్క వాడాడ పిహెచ్ ఆధారం. దీంతో, వైద్య బృందాలు కేవలం విలేజ్ క్లీనిక్ కేంద్రాలుగావున్న 18 గ్రామాల్లో మాత్రమే సేవలందిస్తున్నాయి. ఈ మండలంలోని పూడివలస, పింద్రింగివలస, చినవాడాడ, మల్లంపేట, అచ్చియ్యపేట, లక్ష్మీపురం, హరిజన పాల్తేరు గ్రామాలకు చెందిన రోగులు సంబంధిత విలేజ్ క్లీనిక్‌కి వెళ్లాలంటే కనీసం మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి వుంటుంది. ఈనేపథ్యంలో ఇటువంటి చోట్ల ఇంటింటికీ వైద్య సేవల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయాల్సివుంది. లేదంటే ఎప్పటి మాదిరిగానే ఆర్ఎంపిలను ఆశ్రయించక తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పూడివలసకు చెందిన రెడ్డి తవిటినాయుడు, ఆయన భార్య సుగర్, బిపి, థైరాయిడ్ వంటి రోగాలతో బాధపడుతున్నారు. మందులు అప్పుడప్పుడు మాత్రమే అందుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం బియ్యాలవలస విలేజ్ క్లీనిక్ కేంద్రంలో మినహా దానిపరిధిలోని దురిబిలి, పెళ్లివలస, మంత్రజోల సహా తొమ్మిది గిరిజన గ్రామాలకు ఇప్పటికీ వైద్య బృందాలు సరిగా వెళ్లడం లేదు. ఇలా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇంటింటికీ వైద్యం సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మరోవైపు క్లీనిక్ భవనాలు కూడా పూర్తి కాకపోవడంతో పరాయి పంచల్లోనూ, ఆ అవకాశమూ లేని చోట ఆరు బయట మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందులు, వైద్యపరీక్షలకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతోపాటు అందుకనుగుణంగా వైద్యులు, ఇతర సిబ్బందిని సన్నద్ధం చేయాల్సి ఉంది.

అంచనాలు తారుమారు!

- ఇంకా 40శాతం ధాన్యం రైతుల వద్దే..
- లక్ష్యం కోసం జియోట్యాగింగ్
- కొనుగోలు కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలులో అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. కొనుగోలులో అధికారుల లెక్కలు పూర్తిగా తప్పాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొన్నామన్నది పక్కన పెడితే, రైతుల వద్ద ఇంకా మే మేరకు ధాన్యం ఉన్నాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో గత కొద్ది రోజులుగా కొనుగోలు నిలిపివేసి, లెక్కలతో అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఈ అయోమయంలో జిల్లాలో రైతుల వద్ద ధాన్యం నిల్వలపై జియోట్యాగింగ్ మొదలు పెట్టారు. మంగళవారంతో ఆ ప్రక్రియ పూర్తి కావచ్చింది. అయితే ఇప్పటికైనా కొనుగోలు ప్రారంభమవుతాయా..? అంటే ఎటూ తెల్చలేని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే పంటను నూర్చి రాసుల్లో కొంత మంది, కుప్పలు వేసుకుని మరికొంత మంది రైతులు కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్‌బికెలు, మిల్లర్ల చూట్టూ తిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యం తీసుకుని, ఖరీఫ్ ఆఖరినాటికి మరో లక్ష వరకు కొనుగోలు చేసేవారు. కానీ ఈ ఏడాది పంట బాగా పండిందని అంచనా వేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 5లక్షలు టన్నులు పంట పండుతుందని అంచనా వేశారు. ఇందులో 10శాతం రైతులు స్వప్రయోజనాలకు వినియోగించగా, మిగిలిన 4.5 లక్షల మెట్రిక్ టన్నుల పంట అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. కానీ కొనుగోలు లక్ష్యం మాత్రం పొంతన లేకుండా కేవలం 2.64లక్షల టన్నులకు పరిమితం చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో రెండు వారాల క్రితమే కొనుగోలు లక్ష్యం పూర్తయ్యింది. కానీ అధికారుల లెక్క తప్పడంతో జిల్లా వ్యాప్తంగా సుమారుగా 40 నుంచి 50 శాతం ధాన్యం రైతుల పొలాలు, కళ్లాల్లోనే ఉండిపోయాయి. పోనీ ఎంత ధాన్యం ఉందో ప్రభుత్వానికి నివేదించడానికి అధికారులు లెక్కలు లోపభూయిష్టంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొనుగోలు నిలిపివేసి, రైతుల వద్ద ఉన్న ధాన్యం అంచనాలకు జియోట్యాగింగ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. ధాన్యం ఉండిపోయిన రైతులంతా యాప్‌లో నమోదుచేసుకోవాలని, జియో ట్యాగింగ్ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికైనా కొనుగోలు చేస్తారా? లేదా కల్లబొల్లి మాటలతో రైతులను మభ్యపెడతారా అన్నది వేచిచూడాల్సిందే.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం

'సఖి' ద్వారా బాలికలకు అవగాహన

స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ సిరి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

బాలికలకు సఖి గ్రూపుల ద్వారా ఆరోగ్యం, పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎ.సిరి సూచించారు. శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి జి.చిన్మయిదేవి, సిడిపిఒ బి.శాంతకుమారితో ఆమె కలిసి కొండవెలగాడ హైస్కూల్, నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేట ప్రాథమిక పాఠశాలను సందర్శిం చారు. అనంతరం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో 9 నుంచి 21 ఏళ్ల బాలికలను గుర్తించి సఖి గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్యం, మైనర్ వివాహాలు, రక్షణ, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిడిపిఒ ఎం.సత్యవతి, కె.రాధిక, కొండవెలగాడ హైస్కూల్ హెచ్ఎం పి.విక్టోరియా రాణి, మహిళా పోలీస్ డి.ఆరుద్ర, అంగన్వాడీలు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి

అవినీతి రహిత పాలనే లక్ష్యం

'గడపగడపకు..'లో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి- మెంటాడ

అవినీతి రహిత పాలనే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర తెలిపారు. మండలంలోని బడేవలస గ్రామంలో శుక్రవారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ రాజన్నదొర వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని ఆయన హెచ్చరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తమకు ఇళ్లు మంజూరు కాలేదని కొంతమంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్లు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్ నాయుడు, సర్పంచ్ మీసాల పార్వతి, ఎంపిటిసి సువాని విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ తాడ్డి రామ నాయుడు, సర్పంచులు మహంతి రామనాయుడు, కాపారపు నాయుడు బాబు, ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావు, తహశీల్దార్ ఆదిబాబు, పంచాయతీ అధికారి వి.వి.రవికుమార్, ఎఒ గోకులకృష్ణ, హౌసింగ్ ఎఇ డేవిడ్ ప్రసన్న కుమార్, ఎపిఎం దేవుడుబాబు, బాయి అప్పారావు, సిరిశెట్టి నారాయణరావు, తాడ్డి గురునాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం మేజర్ పంచాయతీలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు మంజూరుకు త్వరలోనే స్థల పరిశీలన చేయాలని, ప్రభుత్వ స్థలం లేని పక్షంలో కొనుగోలు చేసైనా అందిస్తామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మరుగుదొడ్ల బిల్లులు రాలేదని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. యాతవీధిలో ఉన్న డ్రెయిన్ల నుంచి మురుగునీరు సక్రమంగా వెళ్లడం లేదని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి సరిచేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, నాయకులు అల్లు మహాలక్ష్మి నాయుడు, ఎంపిటిసి డోల కనకమహాలక్ష్మి, గట్రెడ్డి పైడితల్లి, అల్లు కిట్టు, పోతనాపల్లి, వసి, చామలాపల్లి సర్పంచులు కె.వెంకటరావు, బంగారు నాయుడు, జుత్తాడ సూర్యారావు. తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఒ రవీంద్ర, ఇఒ రామచంద్రరావు, హౌసింగ్ డిఇ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్య కిషోర్, హౌసింగ్ ఎఇ చిన్నబాబు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

వీలుపర్తి, కుంపల్లిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి, కుంపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలు, వైకెపి, హౌసింగ్, ఉపాధి హామీ, గిరిజనులకు మంజూరు చేసిన భూములు, పిఆర్ జెఇ పనులు, వైద్య ఆరోగ్య శాఖ, తదితర వివరాలను బృందం సభ్యులు గిరిజాపాడి, సత్యరంజన్ పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీల, కుంపల్లి సర్పంచ్ నౌడు అరుణ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, గృహ నిర్మాణ సంస్థ డిఇ డి.శ్రీను, పిఆర్ జెఇ డి.ఆలీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి, సివిల్ సప్లై డిటి రామకృష్ణ, ఎపిఒ సన్యాసిరావు, ఎపిఎం రొంగలి శ్రీనివాసరావు. పంచాయతీ కార్యదర్శులు ఎం.అనూష, సంధ్య, కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్రబృంద సభ్యులు

ఆర్‌సెట్‌లో మెరిసిన ఆణిముత్యం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణానికి చెందిన యేడువాక విజయలక్ష్మి ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఆర్ సెట్)లో 11వ ర్యాంకు సాధించారు. ఆంధ్రా యూనివర్సిటీ చరిత్ర విభాగంలో కేటాయించిన ఒకే ఒక్క పార్ట్‌టైం సీటును సాధించారు. విజయలక్ష్మి గతంలో ఫుల్ టైం పిహెచ్‌డికి అర్హత సాధించినా, ఉద్యోగ రీత్యా వినియోగించుకునేందుకు అవకాశం లభించలేదు. చాలాకాలం తరువాత వెలువడిన నోటిఫికేషన్ కావడం వల్ల గట్టి పోటీని ఎదుర్కొని, సీటు పొందానని విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అరకు)లో ఒప్పంద అధ్యాపకురాలిగా ఆమె పనిచేస్తున్నారు. గతేడాది జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా ఎయు విసి నుంచి పురస్కారం పొందారు. విజయలక్ష్మిని జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, డాక్టర్ వేలూరి సీతారత్నం తదితరులు అభినందించారు.



వై.విజయలక్ష్మి



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. కంచెర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ విజయనగరం కస్పా స్కూల్లో చదివి క్రీడాకారుడుగా రాణించి అమెరికాలో స్థిరపడి క్రీడలను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చి రాష్ట్ర పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విజయనగరం లో క్రీడలు ప్రోత్సాహానికి, నగరాభివృద్ధికి కంచెర్ల ఫౌండేషన్ సహరించాలని కోరారు. అనంతరం కంచెర్ల ఫౌండేషన్ సభ్యులు కె.కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతిదేవి, కార్పొరేటర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, తవిటిరాజు, ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నం నాయుడు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, చీఫ్ కోచ్ అప్పలనాయుడు, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సత్యన్నారాయణ, కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, వ్యాయమ ఉపాధ్యాయులు గోపాల్, బొమ్మన రామారావు, 8 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరిలో శివరాత్రి ఏర్పాట్లపై పాలకమండలి చైర్మన్ పి.రామకృష్ణ ఆధ్వర్యాన ఇఒ నాగేంద్ర సమక్షంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. శివరాత్రికి వచ్చే యాత్రికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, అటవీ మార్గం ద్వారా కిందకు రావడం, శాశ్వత మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాట్లపై చర్చించారు. పుట్టదార వద్ద షవర్ల ఏర్పాటుకు చర్చించారు. ఫిబ్రవరి 5న పుణ్యగిరిలో శివపార్వతుల కళ్యాణంపైనా సమావేశంలో చర్చించారు. ఈ కళ్యాణంలో అధిక సంఖ్యలో భక్తులను భాగస్వామ్యం చేయాలని తీర్మానించారు. సమావేశంలో డైరెక్టర్లు జి.సత్యసాయి, కె.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, ఎలమంచిలి ఈశ్వరరావు, అర్చకులు రాజగోపాలచార్యులు, లట్టాల మణిశర్మ, శేఖర్ పాల్గొన్నారు.

ఫేషియల్ హాజరు నుంచి మినహాయించాలని


కార్పొరేషన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులతో పాటు ఒప్పంద కార్మికులకు కూడా ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడంతో ఒప్పంద కార్మికులు, పర్మినెంట్ కార్మికుల్లో ఆందోళన నెలకొంది. ఈనేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని విరమించుకోవాలని సి ఐటియు ఆధ్వర్యాన శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ మాట్లాడుతూ కార్మికుల్లో అత్యధిక మందికి స్మార్ట్ ఫోన్లు లేవని, ఉన్నా నైపుణ్యం లేని కార్మికులే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. చదువు కూడా అంతంత మాత్రమేనని తెలిపారు. హాజరు పడితేనే జీతాలు వస్తాయని చెబుతున్న తరుణంలో కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మునిపల్ కార్మికులను ముఖ్య ఆధారిత హాహారు నుంచి మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. చనిపోయిన, రిటైర్డు అయిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించడం లేదన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ సెలవులు లేవన్నారు. కనీసం రక్షణ పరికరాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ధర్నాలో బి.భాస్కరరావు, ఎన్ పైడిరాజు, జి.కుమార్, లక్ష్మణ్, సూరిబాబు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు



ఇ-క్రాప్ గురించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ బొడ్డవర సచివాలయంలో శుక్రవారం కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ఇ-క్రాప్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు లబ్ధిదారులను పిలిచి వారు నమోదు చేసుకున్న పంట వివరాలను అడిగారు. అనంతరం సచివాలయ పరిధిలో సఖి గ్రూపుల నిర్వహణ గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఒ రవీంద్ర పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌కు ప్రాంతీయ స్థాయిలో ఎంపికలు

విజయనగరం : మార్చి 23, 24వ తేదీల్లో ఢిల్లీ వేదికగా జరగనున్న యూత్ పార్లమెంట్ వేడుకల్లో భాగంగా విజయనగరం నెహ్రూ యువ కేంద్రం వేదికగా ప్రాంతీయ స్థాయి ఎంపికలు జరిగాయి. కోస్తాంధ్ర పరిధిలోని విజయనగరం, పార్వతీపురం, కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన సుమారు 70 మంది యువత ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. జిల్లా యువజన అధికారి జి.విక్రమాధిత్య ఆధ్వర్యంలో జ్యూరీ సభ్యుల సమక్షంలో శుక్రవారం జరిగిన ఈ ప్రక్రియలో యువత ఉత్సాహంగా పాల్గొని విద్యా, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, సోషల్ మీడియా అంశాలపై వర్చ్యువల్ విధానంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏడు జిల్లాల నుంచి సుమారు 70 మంది పాల్గొనగా ప్రతి జిల్లా నుంచి ఇద్దరేసి చొప్పున మొత్తం 14 మందిని జ్యూరీ సభ్యులు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నలుగురు ఎంపికైనట్లు విక్రమాధిత్య తెలిపారు. విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి అన్నాబత్తుల ఇందు జాహ్నవి, కిల్లాన సాయి స్వరూప్, నీల అనూష, సీరా ముత్య మేఘన ఎంపికయ్యారని తెలిపారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి-కొత్తవలస

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని ఉత్తరాపల్లి పంచాయతీలో గాంధీనగర్‌లో కార్మిక సంఘం పతాకాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుంచి జరిగే ఆలిండియా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీల సమస్యలపై మహాసభలో చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో బండ రోజా, సబ్బవరపు లక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-మెంటాడ


మెంటాడలోని అనంతసాగరం చెరువులో ఉపాధి పనులను ఎపిడి జనార్దన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మేట్లతో మాట్లాడుతూ ఎన్ఎంఎస్ యాప్‌లో సాంకేతిక సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. సాంకేతిక సమస్యల వల్ల ఉపాధి వేతనదారులు మధ్యాహ్నం రెండు గంటల వరకు మండుటెండలో నిరీక్షించాల్సి వస్తోందని ఆయన వద్ద వేతనదారులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్ఎంఎస్ యాప్ ద్వారా హాజరు వేయడం వల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేతనదారులకు సక్రమంగా వేతనాలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఒ లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరినాయుడు పాల్గొన్నారు.

సక్రమంగా పాఠశాలల నిర్వహణ

డిఇఒ లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సక్రమంగా అమలు చేయాలని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని డిఇఒ అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభా పాటవాలను నిరంతరం పరిశీలించి, వెనుక బడ్డ వారిని ముందుకు తీసుకువచ్చే బాధ్యత హెచ్ఎం, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల మార్కుషీట్లను అకడమిక్ ప్రకారం సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థుల స్థాయి పరిశీలించి ఆయా పరీక్షల్లో మార్కులు వేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను తనిఖీలు చేస్తామని, అందులో తేడాలు కనిపిస్తే చర్యలు తప్పవని డిఇఒ హెచ్చరించారు. ఈ సమావేశంలో సారిపల్లి హైస్కూల్ హెచ్ఎం డి.రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి



నిత్యావసర సరుకులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ ప్రియాంక, ఉపాధ్యాయులు

'హర్షవర్ధన' విద్యార్థుల ఉదారత

ప్రజాశక్తి-గజపతినగరం

రిపబ్లిక్‌డే నేపథ్యంలో స్థానిక హర్షవర్ధన పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదారత చాటుకున్నారు. ' ది జోయ్ ఆఫ్ గివింగ్' పేరిట ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిపి సేకరించిన నిధులతో శుక్రవారం భూదేవిపేటలో పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. సాయం చేయడంలోనే ఆనందం ఉందంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదారతతో నిధులు అందించారని తెలిపారు. ఆ నిధులతో సరుకులను పంపిణీ చేశామని పాఠశాల కరస్పాండెంట్ వివి ప్రదీప్‌కుమార్, డైరెక్టర్ మైథిలీ ప్రియాంక తెలిపారు. సుమారు 600 కేజీల బియ్యంతో పాటు అన్నిరకాల నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. పేదలకు సాయమందించడంలో తాము ఎప్పుడూ ముందుంటు న్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగుభూమికి పట్టాల కోసం రీసర్వే

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో పెదమేడపల్లి గ్రామంలో 20 ఏళ్లుగా దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సుదీర్ఘ పోరాటం చేయడంతో కదలిక వచ్చింది. శుక్రవారం ఆ భూములను తహశీల్దార్ ఆదిబాబు సర్వే చేయించారు. త్వరలో వీరికి పట్టాలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. 18 ఎకరాల భూమిని సుమారు 80 మంది రైతులు సాగు చేస్తున్నారు. అందులో గతంలో దళితులు జీడి మామిడి మొక్కలు వేయగా, అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెట్లను నరికి వేశారు. ఈ విషయమై డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లగా, సానుకూలంగా స్పందించారు. దళితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

కార్యదర్శి రాజకుమార్‌పై విచారణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రంగారాయపురం సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి రాజకుమార్‌పై సమగ్ర విచారణ చేయాలని ఎంపిడిఒ కె.రూపేష్.. ఇఒపిఆర్‌డి జ్ఞానేశ్వరరావును ఆదేశించారు. రంగారాయపురం సచివాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను సంతపేట ఎంపిటిసి కె.సత్యవతి భర్త జగ్గన్నదొర ఆవిష్కరించడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేసిన విషయం విదితమే. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సచివాలయ కార్యదర్శిని మందలించి, గ్రామస్తులకు సర్దిచెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంపిడిఒ రూపేష్ విలేకరులతో మాట్లాడారు. ఇఒపిఆర్‌డి ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ విషయంలో తన తప్పేమీ లేదంటూ కార్యదర్శి రాజకుమార్ 'ప్రజాశక్తి'తో అన్నారు. తాను రావడం ఆలస్యం కావడంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఇంజినీర్ అసిస్టెంట్ హేమంత్‌కు గణతంత్ర దినోత్సవ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తమ ఆదేశాలను పాటించకపోవడంతో వారిద్దరికి మెమోలు జారీ చేసినట్లు చెప్పారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జాతీయ కబడ్డీ పోటీలకు ప్రకాశ్ ఎంపిక

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఎపి ఆదర్శ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థి ఎం.ప్రకాశ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నెల్లిమర్ల మండలం అలుగోలులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రకాశ్ జిల్లా జట్టు తరపున సత్తాచాటాడు. ఈ పోటీల్లో విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచింది. దీంతో ప్రకాశ్‌ను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు, సిబ్బంది అభినందించారు.

ఆచూకీ చెబితే నజరానా



రమేష్

కొత్తవలస : ఈ ఫొటోలోని వ్యక్తి వివరాలు తెలియజేస్తే తగిన పారితోషికం ఇస్తామని కొత్తవలస పోలీసులు తెలిపారు. వైశ్య రాజు రమేష్ అలియాస్ దశరథి అనే వ్యక్తి కొత్తవలస పోలీస్ స్టేషన్లో సిఆర్ నంబర్ 144/2012 కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఎస్.కోట కోర్టులో ఎప్పటి నుంచో హాజరుకాకపోవడంతో ప్రొక్లమేషన్ పెండింగ్‌లో ఉందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని కొత్తవలస పోలీసులు తెలిపారు. ఈ ముద్దాయి వివరాలు తెలిసినవారు కొత్తవలస పోలీసులకు సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా హైస్కూల్‌లో 1982-83లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఎంఆర్ కళాశాల ఆవరణలో కలుసుకున్నారు. గొర్తి వాసుదేవరావు, గ్రంధి నాగేశ్వర్‌రావు, ఉల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పాత విద్యార్థుల గెట్ టుగెదర్ వేడుకకు హాజరయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉల్లాసంగా గడిపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు తో పాటు ఆ పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులు పదిమందికి సన్మానం చేశారు.

కానిస్టేబుల్ గౌరినాయుడుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

విజయనగరంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా లక్కవరపుకోట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సూరెడ్డి గౌరినాయుడుకు కలెక్టర్ సూర్యకుమారి ప్రశంసాపత్రాన్ని అందించారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఆయనకు ప్రశంసలు దక్కాయి. పార్వతీపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 2013 నుండి 2017 వరకు విధులు నిర్వహించి, లక్కవరపుకోటకు వచ్చిన ఆయన నేటి వరకు ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. గౌరినాయుడును ఎస్‌ఐ ఎం.ముకుందరావు, ఎఎస్‌ఐలు యువరాజు, సత్యం, వెంకటేష్, స్టేషన్ సిబ్బంది అభినందించారు.



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ గౌరినాయుడు

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

'యువగళం'కు మద్దతుగా కార్యక్రమాలు • పలుచోట్ల ర్యాలీలు

ప్రజాశక్తి-భోగాపురం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగారు రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రవిశేఖర్ అన్నారు. టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మద్దతుగా పోలిపల్లి గ్రామంలో శుక్రవారం బంగార్రాజు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పోలిపల్లిలో పాదయాత్రను ప్రారంభించి, బంగార్రాజుపేట, కొండరాజుపేట మీదుగా దాకమర్రిలోని తాజుద్దీన్ బాబా ఆశ్రమానికి చేరుకొన్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజుద్దీన్ బాబా ఊరేగింపు రథం, కోలాటం, స్వామి గారడీలు, సాలూరు పొడుగు బొమ్మలు, తీన్మార్ డప్పులు, దాండియా నృత్యం, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో పాదయాత్ర సాగింది. కార్యక్రమంలో టిడిపి భోగాపురం, డెంకాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, నెల్లిమర్ల పట్టణ అధ్యక్షులు లంక అప్పలనాయుడు, నాయకులు కర్రోతు రాజు, నీలాపు అప్పలరామిరెడ్డి, తోగులరెడ్డి, దాసరి అప్పలస్వామి, రామసూరి, ఆటో బంగారు రాజ్, జయరాం పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని చిట్టిగుంకలాంలోని కనకదుర్గమ్మ ఆలయంలో టిడిపి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, మాజీ సర్పంచ్ దిండి పెంటరాజు, దిండి సురేంద్ర, దిండి కోటి, దుర్గాసి చిన్నరమణ, పోతున సాయి, దుర్గాసి భూషణ్, రేసు బ్రహ్మాజి, పిన్నింటి రాము, సురేష్, నరేష్, సత్యంపాత్రుడు, చిన్నభూషణ్, రవి పాల్గొన్నారు.

మెంటాడ : మెంటాడలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి, కనకదుర్గ ఆలయాల్లో టిడిపి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, నాయకులు గెద్ద అన్నవరం, రెడ్డి ఎర్నాయుడు, సిరిపురం గురునాయిడు, డర్రు అనిల్ కుమార్, గెద్ద కాశీవిశ్వేశ్వరరావు, కె.చిన్నంనాయుడు, నాగరాజు, రాజగోపాల్, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యాన స్థానిక పూడమ్మతల్లి వనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నడిపేన నారాయణమూర్తి, పొడుగు కృష్ణవేణి, కాళ్ల సత్యవతి, బోలే కృష్ణమూర్తి, మహంతి శ్రీనివాసరావు, బైరెడ్డి కళ్యాణ్, మాత గోపి, కిల్లంపల్లి కృష్ణారావు, కాళ్ల గంగాధర్, చందక పెంటం నాయుడు, నక్కా రామ స్వామి, నందం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : యువ గళం పాదయాత్రను వైసిపి నాయకులు, ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తే ప్రజలు, టిడిపి కార్యకర్తలు ఆ పార్టీని తొక్కేయడం ఖాయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా అన్నారు. యువగళం పాదయాత్రకు మద్దతుగా కోట నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం పూజలు చేశారు. అనంతరం కోటకు చేరుకుని ఆర్టిస్ట్ జిలానీ వేసిన యువ గళం ముగ్గు చుట్టూ బెలూన్లను గాల్లోకి విడిచిపెట్టారు.

కొత్తవలస : కొత్తవలసలోని చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో 100 మందికి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్న సంతర్పణ చేశారు. టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ, విశాఖ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొరుపోలు అప్పారావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు లాలం అర్జునరావు, గొంప దుర్గాప్రసాద్, విరోతి పాల్గొన్నారు.

విజయనగరం కోట : భవిష్యత్ తరాల కోసమే నారా లోకేష్ యువగళం పేరిట పాదయాత్ర ప్రారంభించారని టిడిపి నాయకులు అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ప్రారంభించిన యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని సంఘీభావంగా కోట వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బెలూన్లు ఎగురవేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్ , బంగారుబాబు, నర్సింగరావు, మురళీనాయుడు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన పోవాలని, నీచమైన రాజకీయాలకు స్వస్థి పలకాలని చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నర్సింగ రావు, కంది మురళీనాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ గణేష్ ఆలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు వైకుంఠం మైథిలీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి : కోటలో బెలూన్లు ఎగురవేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



సంఘీభావ పాదయాత్రలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్రోతు బంగార్రాజు, నాయకులు రవిశేఖర్

మీ ఆప్యాయత మరువలేను : సుమన్

ప్రజాశక్తి-మెరక ముడిదాం

అతి ప్రాచీనమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని ప్రముఖ సినీ నటుడు సుమన్ తెలిపారు. శుక్రవారం కరాటే కింగ్, దక్షిణ భారత కరాటే అసోసియేషన్ చైర్మన్ సుమన్ బైరిపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. అనంతరం అభిమానులతో మాట్లాడుతూ ప్రజల ఆధారాభిమానాలో, అనేక భాషల్లో పలు చిత్రాల్లో నటించానని, అభిమానుల ఆప్యాయత ఈ గ్రామ ప్రజలు చూపించిన అనురాగం మరువలేనని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సుమన్ మాట్లాడారు. తల్లి తండ్రులు ఎంతో ఆశ పెట్టుకొని మిమ్మల్ని చదివిస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయకుండా చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. అనంతరం సుమన్‌ను గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, కమిటీ సభ్యులు సన్మానించారు.



సుమన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామ నాయకులు

పురాతన వస్తువుల సేకరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురంలో గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా సేవా కళాపీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు శుక్రవారం పురాతన వస్తువులు, వాయిద్యాలను సేకరించారు. ఉత్తరాంధ్రలో గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టి కనుమరుగైపోతున్న జానపద ప్రాచీన వాయిద్యాలతోపాటు ప్రాచీన వస్తువులను సేకరిస్తున్నట్లు కూర్మారావు తెలిపారు. ప్రొఫెసర్ జె.తిరుమలరావుతో కలిసి ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించి ఇత్తడి వస్తువులు, ప్రాచీన నాణేలు, రైతులు ఉపయోగించే బుర్రగిడుగు, ప్రాచీన కత్తులు, వెదురు బుట్టలు, తదితర వస్తువులు సేకరిస్తున్నట్లు చెప్పారు. తాళపత్ర గ్రంథాలు, శాసనాలు, పటం కథలు, గిరిజన వాయిద్యాలు సేకరించి, మ్యూజియం ఏర్పాటుచేయాలన్నది తన లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో జానపద కళాపీఠం సభ్యులు పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బుట్టలు విక్రయిస్తున్న మహిళతో మాట్లాడుతున్న బద్రి కూర్మారావు

నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధిగా సుబ్రమణ్యం



ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోట నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధిగా చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం నియమితుల య్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఫిబ్రవరి ఒకటో తేదీన తాడేపల్లిలో జరిగే రాష్ట్ర సమావేశానికి నియోజకవర్గం తరపున సుబ్రమణ్యం హాజరు కానున్నారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడానికి ఈ సమావేశం దోహపడనుంది. తనను సర్పంచుల ప్రతినిధిగా నియమించినందుకు సిఎం జగన్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, మండల నాయకులకు సుబ్రమణ్యం ధన్యవాదాలు తెలియజేశారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని మెడికల్ షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరా భారతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన మందులను అమ్మాలని షాపు యజమానులను కోరారు. మందులు కొనుగోలు చేస్తే బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

ఆంధ్రుల ద్రోహి జగన్ : గురాన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ దగ్గర ప్యాకేజీ తీసుకుని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆస్తులను తెలంగాణాకు దారాదత్తం చేసిన ఆంధ్రుల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని జనసేన నాయకుడు గురాన అయ్యలు ఆరోపించారు. శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మంత్రులు నోటికి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించి, పాలన గురించి మాట్లాడుతుంటే వైసిపి నాయకులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. సిఎం జగన్ కేసీఆర్ చేతిలో కీలుబొమ్మ అన్నారు. అత్యున్నత భావాలు కలిగి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం గురించి అలోచించే తమ నాయకుడు పవన్ కల్యాణ్ గురించి వైసిపి నాయకులు విమర్శలు చేయడం విచారకరమని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా విజయనగరం రూరల్ పోలీసు స్టేషను పరిధిలో ఆటోలు నడుపుతున్న డ్రైవర్లకు శుక్రవారం పుష్పగిరి కంటి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లుగా రూరల్ సిఐ టి.వి. తిరుపతిరావు తెలిపారు. రూరల్ పోలీసు స్టేషను పరిధిలో వివిధ గ్రామాల్లో నివసిస్తూ, ఆటోలు నడుపుతు జీవిస్తున్న డ్రైవర్లును గుర్తించి, వారికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ టివి తిరుపతిరావు మాట్లాడుతూ - రహదారి ప్రమాదాల నియంత్రణలో డ్రైవర్లకు దృష్టి లోపం లేకుండా ఉండడం చాలా అవసరమన్నారు. చాలామంది డ్రైవర్లు తమ కళ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా, ప్రాథమిక స్థాయిలో వైద్యం పొంది, దృష్టి లోపాలను సరి చేసుకోని కారణంగా శాశ్వతంగా దృష్టి కోల్పోతున్నారన్నారు. పుష్పగిరి కంటి వైద్యుల సహకారంతో వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకొని, కండ్లకు పరీక్షలు చేసుకొని, వైద్యులు సూచనలు, సలహాలు, చికిత్సతో దృష్టి లోపాలు లేకుండా చూసుకోవాలని సిఐ తెలిపారు. రూరల్ ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్సు, సి-బుక్,డ్రైవింగు లైసెన్సు, పొల్యూషన్ ధ్రువ పత్రాలు ఉన్నట్లే, డ్రైవర్లు సురక్షితంగా వాహనాలు నడిపేందుకు ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గణేష్, పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాజేశ్వరరావు, సురేష్, ఇతర పోలీసు అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



వారోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌టిసి డిఎం రమేష్

ప్రమాద నివారణే లక్ష్యం : డిఎం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రమాద నివారణే అంతిమ లక్ష్యమని శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. శుక్రవారం నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రత వారోత్సవాలను ఎస్.కోట డిపోలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆటో, వివిధ కార్యక్రమాల ద్వారా సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యాచకుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని దేవి కూడలిలో శుక్రవారం ఎస్.కోట డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొని యాచకుడు అప్పారావు మృతి చెందినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఎస్.కోట డిపోకి చెందిన బస్సు అల్లూరి సీతారామరాజు జిల్లా కించుమండ నుండి ఎస్.కోట మీదుగా విశాఖపట్నం వెళ్తోంది. ఎస్.కోట దేవి జంక్షన్‌లో యాచకుడు రోడ్డు దాటే క్రమంలో ముందు భాగం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా యాచకుడు మృతి చెందాడు. అప్పారావు వయస్సు 65 నుంచి 70 ఏళ్లు ఉండవచ్చని డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ప్రమాదం జరిగే సమయంలో మద్యం సేవించి ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్టు చెప్పారు. ఎస్ఐ జె.తారకేశ్వరరావు కేసు నమోదు చేశారు.

కత్తితో బెదిరించి సెల్ ఫోను లాక్కెళ్లిన నిందితులు అరెస్ట్

విజయనగరం : ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన నిందితుడ్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ వెంకటరావు తెలిపారు. ఈనెల 21న రాత్రి 1.30 గంటల సమయంలో కొత్తపేటకు చెందిన రెడ్డి సన్యాసిరావును ముగ్గురు నిందితులు కత్తులతో బెదిరించి, అతని వద్ద నుండి సెల్ ఫోను లాక్కెళ్లారు. దీంతో ఆయన 1వ పట్టణ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చెయ్యగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మంగళవీధికి చెందిన షేక్ హుస్సేన్, మరో ఇద్దరు బాలురు స్కూటీపై శుక్రవారం స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడ వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. నేరాన్ని అంగీకరించడంతో వారి నుంచి సెల్‌ఫోన్, కత్తులు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు సిఐ తెలిపారు. ఎస్ఐ వి.అశోక్ కుమార్, హెచ్‌డ్ కానిస్టేబుల్ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్ల టి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు దర్యాప్తులో సహకరించారు.

ధాన్యం దగ్ధం

వంగర : మండలంలోని కొప్పరవలసకు చెందిన సాదెం సింహాచలం, గుడివాడ అప్పలనాయుడుకు చెందిన ధాన్యం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ఘటన పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం పెద్దింపేట పంచాయతీ పోలినాయుడువలస పరిధిలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. కొప్పరవలసకు చెందిన సింహాచలం, అప్పలనాయుడుకు చెందిన ధాన్యాన్ని తూకం వేసి, కొనుగోలుకు ఎవరూ రాకపోవడంతో పొలంలోనే నెట్టువేశారు. శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో ధాన్యానికి నిప్పు అంటుకొని మంటలు వ్యాపించాయి. అటుగా వెళ్లిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ గమనించి సమాచారం ఇవ్వడంతో స్థానికులు మంటలను అదుపుచేశారు. 35 బస్తాల వరకు ధాన్యం కాలిబూడిదైనట్లు బాధితులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి ఎవరో సిగరెట్ కాల్చి దారిలో పడేయడం వల్ల మంటలు వ్యాపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరుగాలం శ్రమించి, పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యం ఇలా అగ్నికి ఆహుతులవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా వినిపిస్తున్నారు.